ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 8 అక్టోబరు 2025





సిరిమానోత్సవంలో భక్తజనం

పైడిమాంబకు ప్రణమిల్లి

- అంబరాన్నంటిన సిరిమాను సంబరం
- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- వర్షంలో తడుస్తూనే నిరీక్షణ

విజయనగరం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పైడితల్లి సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భక్తులు సిరిమాను ఊరేగింపును కనులారా వీక్షించి పులకించిపోయారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు అమ్మవారి ప్రతిరూపంగా సిరిమానును అధిరోహించి అశేష భక్త జనానికి ఆశీస్సులు అందించారు. షెడ్యూల్ ప్రకారం జిల్లా యంత్రాంగం సిరిమానోత్సవాన్ని మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించాలని నిర్ణయించింది. వర్షం కారణంగా సాయంత్రం 4.22 గంటలకు సిరిమాను ఊరేగింపు మొదలైంది. 5.45 గంటల వరకూ సాగింది. అంతకుముందు హుకుంపేటలో సిద్ధమైన సిరిమాను, ఇరుసుమాను, ఇతర రథాలను మధ్యాహ్నం 1.30 గంటలకు చదురుగుడికి చేర్చారు. ఆలయ పూజారి వెంకటరావు హుకుంపేట నుంచి కాలినడకన చదురుగుడికి 2.45 గంటలకు చేరుకున్నారు. వేద పండితులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయ వస్త్రధారణలో తలపాగా ధరింపజేసి పూజారి వెంకటరావును సిరిమాను అధిరోహణకు సిద్ధం చేశారు. అదే సమయానికి భారీ సంఖ్యలో భక్తులు ఇటు కోట, అటు గంటస్తంభం, అంబటి సత్రర్వు రోడ్డు, గురజాడ అప్పారావు స్వగృహం రోడ్డు వద్దకు చేరుకున్నారు. సిరిమానోత్సవం ప్రారంభానికి ముందు వర్షం పడడంతో ఏర్పాట్లకు స్వల్పంగా ఆటంకం కలిగింది. వర్షం తగ్గాక 4.22 గంటలకు సిరిమాను, రథాలు కదిలాయి. సిరిమాను పైకి అరటి పండ్లను విసురుతూ భక్తిప్రపత్తులను చాటారు. పైడిమాంబ పరివారంగా భావించే అంజలి రథం, జాలరి వల, పాలధార, తెల్ల ఏనుగు నడవగా సిరి మాను చదురుగుడి నుంచి కోట వద్ద ఉన్న కోట శక్తిని తాకుతూ మూడు పర్యాయాలు తిరిగింది. సిరిమాను తిరిగే రోడ్డంతా భక్తజనంతో రద్దీగా మారిపోయింది. మూడంచెల భద్రత ఉండడంతో అరటిపండ్లు, పూలు సమర్పించేందుకు కొన్ని మార్గాల్లో అవకాశం

(మిగతా 8వ పేజీలో...)



కరుణించమ్మా..



సిరిమానును అధిరోహించిన పూజారి బంటుపల్లి వెంకటరావు



సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న గోవా గవర్నర్ అశోక్, మంత్రులు తదితరులు



పట్టువస్త్రాలతో ఆలయానికి వెళ్తున్న మంత్రి ఆనం, ఘటంతో మంత్రి అనిత

గురుకులాల్లో పర్యవేక్షణ

- గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నాయక్
- జిల్లాకేంద్రాసుపత్రి, కురుపాం గురుకులం సందర్శన
- బాలికల ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- పరిస్థితి అదుపులో ఉందని వెల్లడి

పార్వతీపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యా సంస్థల్లో ఐటీడీఏ పీవో లేదా డీడీ స్థాయి అధికారితో పర్యవేక్షణ తప్పనిసరి చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్ తెలిపారు. ప్రతి గురువారం ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం, నెలకొకసారి డాక్టర్లు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం పార్వతీపురం వచ్చిన ఆయన స్థానిక పోలీస్ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 'కురుపాం గురుకులానికి చెందిన బాలికలు పచ్చకామెర్లతో బాధపడు తుండడం ఎంతో బాధగా ఉంది. ప్రస్తుతం విద్యార్థినులు విశాఖపట్నం కేజీహెచ్‌తో పాటు పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారంతా క్షేమంగా ఉన్నారు. పరిస్థితి అదుపులో ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు పార్వతీపురం వచ్చా. గురుకుల విద్యాలయాలతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్స్, మరుగుదొడ్లు , అదనపు తరగతి గదులు నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఎంతైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే మరుగు దొడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయి. పాఠశాల స్థాయిను బట్టి విద్యార్థుల సంఖ్య ఉండే విధంగా చూస్తాం. ప్రస్తుతం పాఠశాలల్లో స్థాయిని మించి విద్యార్థులు ఉంటే అదనపు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. కురుపాం విద్యార్థినులు జాండీస్‌తో ఎందుకు బాధపడు తున్నారో నివేదికలు వచ్చిన తర్వాత తెలుస్తుంది. కలుషిత ఆహారమా?లేక మరే ఇతర కారణమన్నది అనేది తేలాల్సి ఉంది.' అని తెలిపారు. అనంతరం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందు తున్న కురుపాం గురుకుల బాలికలను నాయక్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని వైద్యులకు సూచించారు. త్వరగా కోలుకునేలా చూడాలన్నారు. ఇదిలా ఉండగా గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు ఆయన్ని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ నాగభూషణరావు, సూపరింటెం డెంట్ నాగశివజ్యోతి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రాసుపత్రిలో విద్యార్థినిని పరామర్శిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నాయక్

సమస్యలను వెంటనే తెలియజేయండి

కురుపాం,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో సమస్యలేమైనా ఉంటే వెంటనే కలెక్టర్, ఐటీడీఏ పీవోకు తెలియజేయాలని గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్ ఆదేశించారు. మంగళవారం గురుకులాన్ని ఆయన సందర్శించారు. పాఠశాల స్టోర్ రూమ్, కిచెన్ షెడ్, మరుగుదొడ్లు పరిశీలించి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని అడిగి విషయం తెలుసుకున్నారు. పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలో సరిపడా

(మిగతా 8వ పేజీలో...)

ఆందోళన చెందొద్దు

- నిలకడగా140 మంది బాలికల ఆరోగ్యం
- 35 మంది డిశ్చార్జి
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం/బెలగాం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కురుపాం గురుకుల పాఠశాలకు చెందిన 140 మంది విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎవరూ ఆందోళన చెందొద్దని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రాసుపత్రిలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. 140 మందిలో 57 మందిని మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించామని , ప్రస్తుతం 83 మంది విద్యార్థినులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. వారిలో 35 మందిని మంగళవారం ఒక్కరోజే డిశ్చార్జి చేసి ఇళ్లకు పంపించామన్నారు. ఇంటికి వెళ్లిన వారి ఆరోగ్య స్థితిని రోజూ ఏఎన్ఎం పర్యవేక్షించి ఉన్నతాధికా రులకు నివేదికలు అందిస్తారని తెలిపారు. ఇదిలా ఉండగా విశాఖ కేజీహెచ్‌కు పంపిన వారిలో 13 మంది కోలుకున్నారని, వారిలో 8 మంది పార్వతీపురం వస్తున్నారని వెల్లడిం చారు. వారిని జిల్లా కేంద్రాసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతామన్నారు.

బోధనా సిబ్బందిలో ఒకరికి జాండీస్

కురుపాం గురుకులంలో బాలికలతో పాటు బోధనా సిబ్బందికి రక్త పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే బోధనా సిబ్బందిలో ఒకరికి పచ్చకామెర్లు వచ్చినట్టు వైద్యులు ధ్రువీకరించి చికిత్స అందిస్తున్నారు.



డిశ్చార్జి అయిన విద్యార్థినులతో కలెక్టర్ ఇతర అధికారులు

జనసంద్రమైన హుకుంపేట
- సిరిమాను దర్శనానికి క్యూ కట్టిన భక్తజనం
6లో

ఘనంగా వాల్మీకి జయంతి
8లో

పశువులకు టీకాలు వేయించండి
- ఉమ్మడి జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీలు

ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ
8లో

ఘనంగా పైడిమారమ్మ జాతర
- లక్ష్మీనారాయణపురంలో సందడే సందడి
8లో

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలన

- 14 నుంచి ప్రారంభం
- 2,781 మందికి తనిఖీలు

గరుగుబిల్లి, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగ పింఛన్ల పునః పరిశీలనకు రంగం సిద్ధమవుతుంది. మొత్తంగా 2,781 మందికి ఈ నెల 14 నుంచి తనిఖీలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వాస్తవంగా ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు నాలుగు వైద్య బృందాలు దివ్యాంగ పింఛన్‌దారుల తనిఖీలు చేపట్టాయి. 7,924 మంది వైకల్య శాతం, సద రం ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాయి. అయితే 2,781 మందికి పైగా వైకల్య శాతంలో లోపాలు ఉన్నట్లు గుర్తించి నివేదికలు అందించారు. దీంతో ఎంపీడీవోలు వారికి నోటీసులు జారీ చేశారు. కాగా పింఛన్లు నిలుపుదల చేస్తామనడంతో దివ్యాంగ పింఛన్‌దారులు తీవ్ర ఆందోళన చెందారు. అయితే ప్రభుత్వం యథావిధిగా అందరికీ పింఛన్లు పంపిణీ చేయడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

గతంలో నోటీసులిచ్చిన వారికి..

గతంలో నోటీసులందించిన దివ్యాంగ పింఛన్‌దారులను ఈ నెల 8 నుంచి కేటాయించిన ఆసుపత్రుల్లో తనిఖీలకు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సెర్ప్ ఉన్నతాధికారి ఎ.కల్యాణ్ చక్రవర్తి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే అప్పీలు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించి ఆసుపత్రి కేటాయింపు, తేదీ, సమయాన్ని తెలియజేయాలన్నారు. అయితే బుధవారం నుంచి తనిఖీలు ప్రారంభమవ్వాల్సి ఉండగా.. జిల్లా ఉన్నతాధికారుల విన్నపం మేరకు ఈ ప్రక్రియను ఈనెల 14కు వాయిదా వేశారు.

వారంలో మూడు రోజులు..

జిల్లాలోని ప్రధాన ఆసుపత్రుల్లో బుధ, గురు, శుక్రవారాల్లో తనిఖీలు చేపట్టనున్నారు. కంటికి సంబంధించి 20 మంది, లోకోమేటర్‌కు 30 మంది, దివ్యాంగ డిజేబుల్‌కు ఐదుగురు, వినికిడికి సంబంధించి 30 మంది, ఎంఆర్, ఎంఐకి గాను 20 మంది చొప్పున

(మిగతా 8వ పేజీలో...)



వైకల్య శాతం తక్కువగా ఉంటే..

85 శాతం పైబడిన వైకల్యం ఉన్న వారికి, మంచానికి పరిమితమైన వారికి రూ. 15 వేలు అందిస్తారు. 85 శాతం కంటే తక్కువ ఉండి 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి రూ.6 వేలు, 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉండి 60 సంవత్సరాలు పైబడిన వారికి రూ.4 వేలు ఇస్తారు. 60 సంవత్సరాలు కంటే తక్కువ వయసు ఉంటే పింఛన్ తొలగిస్తారు. 40 శాతం కంటే అధికంగా వైకల్యం ఉంటే రూ.6 వేలు అందిస్తారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి రూ.4 వేలు వృద్ధాప్య పింఛన్‌కు మార్పు చేయనున్నారు. వయసు తక్కువగా ఉంటే పింఛన్ రద్దయ్యే అవకాశం ఉంది.

గంజాయి స్వాధీనం
7లో
- పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద ముగ్గురి అరెస్ట్

రైతు సేవా కేంద్రంలో చోరీ

భార్య కళ్లెదుటే నదిలోకి దూకేశాడు
7లో

బిల్లులు కాక.. పనులు సాగక



7లో

పార్వతీపురంలో మారిన సీన్

- తాత్కాలిక మునిసిపల్ చైర్‌పర్సన్‌గా ఉమామహేశ్వరి
- నాటకీయ పరిణామాల మధ్య ఎన్నిక

బెలగాం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మునిసిపాలిటీ తాత్కాలిక చైర్ పర్సన్‌గా 23వ వార్డుకు చెందిన మంత్రి ఉమామహేశ్వరిని ఎన్నుకున్నారు. ఆమె ఆధ్వర్యంలో రూ.80 లక్షల విలువైన రోడ్లు, కాలువల పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రజలకు తాగునీరు అందించడంలో విఫలమయ్యారని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఒకరినొకరు విమర్శించుకున్నారు. ఇదే సమయంలో అధికారులు సైతం తనను లెక్క చేయడం లేదని, కూటమికి అనుకూలంగా నడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి వాకౌట్ చేశారు. అయితే ఆమె ఇలా సమావేశం మధ్యలో వెళ్లిపోవడం నాలుగోసారి. దీనివల్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని కౌన్సిలర్లు, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర భావించారు. ఈ మేరకు 1965 మునిసిపల్ చట్టం ప్రకారం మెజార్టీ కౌన్సిలర్ల ఆమోదంతో తాత్కాలిక చైర్ పర్సన్‌గా మంత్రి ఉమామహేశ్వరిని ఎన్నుకున్నట్టు కమిషనర్ శ్రీనివాసరాజు తెలిపారు.



తాత్కాలిక చైర్‌పర్సన్ ఉమామహేశ్వరిని గౌరవంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే విజయచంద్ర

సిరి సంబరం

- పైడితల్లి సిరిమానోత్సవానికి పోటెత్తిన భక్తులు



ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరంలోని పైడితల్లి సిరిమానోత్సవానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం సాయంత్రం ఉత్సవం ప్రారంభానికి కొద్దిసేపటి ముందు వర్షం కురిసినా.. కదలకుండా భక్తులు నిరీక్షించారు. సిరిమానోత్సవం ప్రారంభమైన సమయంలో 'జై పైడితల్లీ' అనే నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. భక్తులతో పాటు కళాబృందాలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

-ఆంధ్రజ్యోతి బృందం









సిరిమానోత్సవంలో పోలీసుల బందోబస్తు



ఆలయం వద్ద తోపులాట...



పరదా నీడలో వీక్షణం





గుడి ఎదుట భక్తుల రద్దీ





మజ్జిగ పంపిణీ చేస్తూ...



అమ్మవారి దర్శనానికి...



వాటర్ ట్యాంక్ పైనుంచి సిరిమానును తిలకిస్తూ..

జనసంద్రమైన హుకుంపేట

- సిరిమాను దర్శనానికి క్యూ కట్టిన భక్తజనం



సిరిమానును తయారు చేస్తున్న వీధిలో...



పూజారి ఇంటివైపు వెళ్లే మార్గంలో క్యూ కట్టిన భక్తులు

విజయనగరం కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవం నేపథ్యంలో మంగళవారం ఉదయం హుకుంపేట ప్రాంతం భక్త జనంతో నిండి పోయింది. సిరిమానును దర్శించుకునేందుకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై మొక్కుబడులు తీర్చుకున్నారు. పోలీసు బందోబస్తు మధ్య భక్తులు క్యూ లైన్లో వెళ్లి సిరిమానుకు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసం వద్ద సిరిమాను, ఇరుసుమాను, బెస్తవారి వల, అంజలి రథాలను దర్శించుకుని పూజలు చేశారు. అక్కడి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పసుపు, కుంకుమలు సమర్పించారు. తెల్లవారు జాము నుంచి ఉదయం 11 గంటల వరకు ఇదే పరిస్థితి ఉంది. సిరిమాను దర్శనానంతరం పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసానికి వెళ్లి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు..



భక్తులకు పులిహోరా పంపిణీ చేస్తూ..

విజయనగరం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పొరుగున ఉన్న ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరికి వివిధ స్వచ్ఛంద సంస్థలు విభిన్న రూపాల్లో సేవలు అందిస్తుంటాయి. వీరికి పులిహోర, బిర్యానీ, అన్నం, సాంబారుతో పాటు, స్వీట్స్, ఫ్రూట్స్, డ్రింక్స్, మంచినీరు, మజ్జిగ వంటివి అందించారు. ఈ విధంగా విజయనగరానికి చెందిన కుమార్ అండ్ కుమార్ ఫ్రెండ్స్, ఎస్‌బీఐ, రైస్‌మిల్లర్ల అసోసియేషన్, వ్యాపార సంస్థలు సేవలు అందించాయి.

గోవా గవర్నర్ అశోక్‌ను కలిసిన మంత్రి



విజయనగరం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజును మంగళవారం ఆయన నివాసంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పైడిమాంబకు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించేందుకు మంగళవారం మంత్రి రామనారాయణరెడ్డి విజయనగరం వచ్చారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజును కలిశారు. వీరిరువురూ కాసేపు వివిధ అంశాలపై మాట్లాడుకున్నారు.

ఆకట్టుకున్న నేలవేషాలు..

సిరిమానోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం నేల వేషాలు, పులివేషాలు సందడి చేశాయి. మొక్కుబడులకు తీర్చుకునేందుకు పలువురు ఈ వేషాలు వేసి, పైడిమాంబ ఆలయానికి వెళుతుంటారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేషధారులు అంబటి సత్తర్వు రోడ్డు నుంచి మూడులాంతర్లు, గంటస్తంభం వరకూ సందడి చేశారు.

వర్షంలో తడుస్తూనే..

విజయనగరం/ విజయనగరం రూరల్/ కలెక్టరేట్/ దాసన్నపేట, రింగురోడ్డు/కల్చరల్

- సిరిమానోత్సవం ప్రారంభానికి ముందు ఎండ వేడిమి, ఉక్కబోత. అంతలోనే జోరున వర్షం. బయటకు వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో జనం తడుస్తూ రోడ్లపైనే నిరీక్షించారు.
- వర్షం కురుస్తున్న సమయంలో పలువురు యువత డీసీసీబీ వద్ద తడుస్తూ, ఆటపాటలతో సందడి చేశారు.
- క్యూలైన్లో చిన్న పిల్లలకు బిస్కెట్లు, పాలు ఇవ్వలేదు. తాగునీరు మాత్రం సరఫరా చేశారు.
- సిరిమానోత్సవం జరిగే ప్రాంగణంలోకి అనధికారికంగా యువత రావడంతో నిర్వాహకులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.
- వర్షం వచ్చిన సమయంలో అందరూ సెల్‌ఫోన్లు, మనీ పర్సులు తడవకుండా జాగ్రత్త పడ్డారు. కవర్ల కోసం వెతుకులాట ప్రారంభించారు. సాధారణ రోజుల్లో రూపాయికి అమ్మే కవర్ రూ.10కి విక్రయించారు.
- ఒక్క నిమిషంలో వీఐపీ బ్రేక్ దర్శనాల ప్రకటన మాటలకే పరిమితమైంది.
- ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కోసం ఏర్పాటు చేసిన వేదిక కూలిపోయిందన్న సమాచారం చర్చనీయాంశమైంది
- డీఐజీ గోపీనాథ్ జట్టీ కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలను పర్యవేక్షించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ సిరిమాను వెంట తిరిగి, బందోబస్తును పర్యవేక్షించారు.
- సిరిమాను తిరుగుతున్న సమయంలో ప్రాంగణంలో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.

నగరంలో జోరు వాన

- భక్తులకు తప్పని ఇక్కట్లు

విజయనగరం కలెక్టరేట్/రింగురోడ్డు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో మధ్యాహ్నం 3.20 గంటలకు జోరు వాన కురిసింది. మధ్యాహ్నం 3 గంటలకే సిరిమాను ప్రక్రియను ప్రారంభిస్తామన్న అధికారుల ప్రకటనకు ఇది ఇబ్బందిగా పరిణమించింది. మరోవైపు భక్తులు వర్షంలో తడవకుండా ఉండేందుకు సమీపంలోని షాపులు, భవనాల వద్ద తలదాచుకున్నారు. ఇక కొంత మంది యువకులు ఆ వర్షంలో సరదాగా ఆటలు ఆడుకున్నారు. ఉదయమంతా వేసవి తలపించే ఎండ ఉండడంతో భక్తులు కాస్తంత ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశం మేఘావృతమైంది. వెంటనే వర్షం కురిసింది. దీంతో సిరిమాను ఉత్సవాన్ని కాస్త ఆలస్యంగా ప్రారంభించారు.



వానలో తడుస్తూనే..

భక్తులకు దూరంగా..

విజయనగరం కల్చరల్/క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడిమాంబ సిరిమాను ఉత్సవాన్ని తిలకించడానికి లక్షలాదిగా భక్తజనం తరలివస్తారు. ఈ ఏడాది సిరిమాను తిరిగే ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి... కొన్ని మార్గాల్లో సిరిమానుకు అల్లంత దూరంలో భక్తులను నిలిపివేశారు. డీసీసీబీ కూడలి నుంచి గురజాడ అప్పారావు రోడ్డులో మూడెంచెల బారికేడ్లు దాటిన తరువాత భక్తులను నిలిపివేశారు. మూడు లాంతర్లు నుంచి అంబటి సత్తర్వు వేళ్లే మార్గం, కస్పా మార్గంలోనూ దూరంగానే నిలిపివేశారు. మూడులాంతర్లు నుంచి కోట వరకూ ఇరువైపున బారికేడ్లలో ఉన్న జనానికి సిరిమాను కనిపించలేదు. అనేక మంది భక్తులు సిరిమాను కనిపిస్తే అమ్మవారిని దర్శించినట్టు అవుతుందని భావించి... చాలా దూర ప్రాంతాల నుంచి వస్తారు. అటువంటి వారికి నిరాశే ఎదురైంది.



బారికేడ్లలో కనిపించని జనం



గురజాడ అప్పారావు రోడ్డులోని బారికేడ్లు



కస్పా రోడ్డులో..

బిల్లులు కాక.. పనులు సాగక

● అర్థాంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణాలు ● గ్రామ సచివాలయాలకు వచ్చే అర్జీదారులు, సిబ్బందికి అవస్థలు ● ఇదీ బొబ్బిలి మండలంలో పరిస్థితి



ఎం.బూర్జవలసలో నిలిచిపోయిన మరుగుదొడ్డి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని పలు సచివాలయాల ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్ల బిల్లులు కాకపోవడంతో పనులు ముందుకుసాగడంలేదు. ప్రస్తుతం పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో సచివాయాలకు వివిధ పనులపై వచ్చే అర్జీదారులు, అక్కడ పనిచేసే సిబ్బంది మరుగుదొడ్లు లేక అవస్థలకు గురవుతున్నారు. బొబ్బిలి డివిజన్‌లో 78 సచివాలయాలకు గాను వాటి పరిధిలో 63 మరుగుదొడ్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం 21 మాత్రమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. బొబ్బిలి మండలంలో 22 సచివాలయాలకు గాను 17 మంజూరు చేయగా, కేవలం ఎనిమిది మాత్రమే పూర్తి చేశారు. మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయాయి.

ఇదీ పరిస్థితి

బొబ్బిలి మండలంలోని గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజలకు అత్యవసర సమయంలో అవస్థలు పడకుండా ఉండేందుకు మరుగుదొడ్ల నిర్మాణానికి గతప్రభుత్వంహయాంలో నిధులుమంజూరుచేశారు. ఒక్కొక్క మరుగుదొడ్డి నిర్మాణానికి రూ. మూడు లక్షలు చొప్పున కేటాయించి వాటి పనులు అప్పటి అధికార పార్టీ నాయకులకు అప్పగించారు. అయితే పర్యవేక్షణ బాధ్యత గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులకు అప్పగించారు. అయితే అప్పటిపాలకుల నిర్లక్ష్యం వల్ల కాశిందొరవలస, పారాది, ఎం.బూర్జవలస, రంగరాయపురం తదితర గ్రామాల్లో సచివాయాల పక్కన మరుగుదొడ్ల నిర్మాణాలు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అర్థాంతరంగా ఆగిపోయాయి. కాగా గ్రామసచివాలయాల ఆవరణలో మంజూరు చేసిన మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ తెలిపారు.



పారాదిలో శ్లాబ్‌తో నిలిచిన మరుగుదొడ్డి

భార్య కళ్లెదుటే నదిలోకి దూకేశాడు

● బిటివాడ గ్రామానికి చెందిన యువకుడు నాగావళిలో గల్లంతు



జగదీష్ (ఫైల్)

వంగర అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుషింగి వంతెనపై నుంచి నాగావళి నదిలోకి మంగళవారం సాయంత్రం ఓ యువకుడు భార్య కళ్లెదుటే దూకి గల్లంతయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. వీరఘట్టం మండలంలోని బీటీవాడకు చెందిన కల్లేపల్లి జగదీష్ చేపల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నిత్యం వంగర మండలంలోని మగ్గూరు వద్ద చేపలు కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. ఎప్పటిలాగే చేపలు విక్రయించి భార్యాభర్తలు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. రుషింగి వంతెనపైకి రాగానే వాహనం పక్కన నిలిపివేశాడు. భార్య పార్వతీని వాహనంనుంచి కిందకి దింపి ఆమె కళ్లెదుటే నదిలో దూకేశాడు. దీంతో భార్య పార్వతీ కేకలు వేయడంతో సమీపంలోని కొందరు అక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో వర్షం కురుస్తుండడంతో అక్కడకు చేరుకున్న వారు ఏమీచేయలేకపోయారు. గ్రామస్థుల సమాచారం మేరకు వంగర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. జగదీష్ వివరాలు ఆయన భార్యనుంచి సేకరించారు.నిత్యం అన్యోన్యంగాఉంటూ గరుగుబిల్లి మండలంలోని రాయివలస కేంద్రంగా చేపలవ్యాపారం చేసుకునే వారని, సాయంత్రం మగ్గూరు చేరుకుని వేకువజామున లేచి చేపలు మడ్డువలస రేవులో కొనుగోలు చేసేవారని పలువురు తెలిపారు. అయితే జగదీష్ ఇటీవల దుర్గా మాలధారణ చేసి విరమించాడు. తర్వాత మద్యం సేవించడంతో భార్య నిలదీయడం వల్ల నదిలో దూకినట్లు చెబుతున్నారు. కళ్లెదుటే భర్త గల్లంతుకావడంతో పార్వతీ రోదిస్తోంది.

చికిత్సపొందుతూ మహిళ మృతి

కొత్తవలస, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చీపురువలసకు చెందిన ఓ మహిళ చికిత్సపొందుతూ మృతిచెందింది. గ్రామస్థుల కథనం మేరకు.. కొత్తవలస పంచాయతీలోని చీపురువలసకు చెందిన కొచ్చర్ల సత్యవతి (52) ఆవులను మేపేందుకు ఆదివారం తీసుకెళ్లింది. సాయంత్రం గ్రామ సమీపంలో గల విశాఖ -రాయపూర్ హైవే ప్రాంతంలో పిడుగుపాటు వల్ల అస్వస్థతకు గురైంది. దీంతో చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలింగా సోమవారం సాయంత్రం మృతిచెందింది.

రైతు సేవాకేంద్రంలో కంప్యూటర్ చోరీ

కురుపాం రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): గుమ్మలోని రైతుసేవా కేంద్రంలో సోమవారం రాత్రి తాళం పగులగొట్టి కంప్యూటర్‌ను దొంగలు చోరీ చేశారు. మంగళవారం ఉదయంసేవాకేంద్రానికి వచ్చిన సిబ్బంది కార్యాలయ తాళం పగిలి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదు చేశారు.

గరివిడి చర్చిలో ..

గరివిడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):గరివిడి మెయిన్ రోడ్డులోగల బాప్టిస్టు చర్చిలో సోమవారం అర్థరాత్రి చోరీకి యత్నించారు. ఉదయం చర్చి తెరవడానికి వెళ్లగా తాళాలు బద్దలు కొట్టిఉన్నాయి. కానుకల పెట్టెలోని (చర్చి హుండీ) సుమారు 20 వేల వరకు చోరీ జరిగినట్లు అంచనా వేస్తున్నట్లు చర్చి వర్గాలు తెలిపాయి. వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేశారు.ఈ మేరకు ఏఎస్ఐ టీఎస్ఎస్ఎన్ రాజు సందర్శించి సీసీ ఫుటేజ్ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం

పాచిపెంట, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద ఐదు కేజీల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేశామని ఎస్ఐ కె.వెంకట సురేష్ తెలిపారు. ఎస్ఐకథనం మేరకు.. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద మంగళవారం జైపూర్ నుంచి ఆంధ్రా మీదుగా కాశీ వెళ్లేందుకు కాలినడకన ముగ్గురు చెక్‌పోస్టు దాటుతున్న సమయంలో వీరిని తనిఖీచేశారు. వారి వద్ద ఐదు కేజీల గంజాయి ప్యాకెట్ లభించింది. గంజాయిని జైపూర్ సమీపంలోని గుప్తేశ్వర్ ఏరియాలో కొనుగోలుచేశారు.వీరికి గంజాయి సేవించే అలవాటు ఉండడంతో సొంతానికి వినియోగించుకునేందుకు కొనుగోలు చేశారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

రంగరాయపురంలో కూలిపోయిన ఇళ్ల పరిశీలన

లక్కవరపుకోట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రంగరాయపురంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రెండిళ్లు కూలిపోయినట్లు ఆర్ఐ సన్యాసిరావు తెలిపారు.వీఆర్ఏ సాయిరాంతో కలిసి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. చెలికాని దేముడమ్మ ఇల్లుగోడ కూలిపోయిందని, ఏడువాక అప్పారావు ఇల్లు పాక్షికంగా దెబ్బతిందని తెలిపారు. కూలిన ఇళ్లపై నివేదిక తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావుకు అందించామని తెలిపారు.

జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన



రాజాం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు,అధ్యాపకులు


రాజాం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):రాజాం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దూసి రామారావు ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై విద్యార్థులతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మంజి షణ్ముఖరావు, మధు పాల్గొన్నారు,

● గుర్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు ఆదిత్య రమణ ఎకనామిక్స్ అధ్యాపకులు రవి పాల్గొన్నారు.

చెట్లు కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):రాజాంవ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో విద్యుత్ వైర్లపై మూడు చెట్లు మంగళవారం మధ్యాహ్నం కూలిపోయాయి.దీంతో మధ్యాహ్నం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.బొబ్బిలి రోడ్డులోని గోపాలపురం సబ్‌స్టేషన్ నుంచి వస్త్రపురి కాలనీ, కంచరాం,రాజీయ్యపేట, ఆగూరు, అమరాం, దోసరి,రామినాయుడు వలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాచేస్తున్నారు.మధ్యాహ్నం కురిసిన వర్షానికి గాలులు వీయడంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో విద్యుత్ వైర్లపై మూడుచెట్లు విరిగిపడటంతో ఐదు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.విద్యుత్ సిబ్బంది చెట్లను తొలగించి సరఫరా పునరుద్ధరించి నా లోవోల్టేజ్ సమస్య వల్ల వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. కాగా చెట్లు విరిగిపడి వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని ట్రాన్స్‌కో ఏఈ కుమార్ తెలిపారు. వైర్లు సరిచేయడంలో జాప్యం కావడంతో ఇబ్బందులుఏర్పడ్డాయని, సిబ్బంది దగ్గరుండి చెట్లను తొలగించి వైర్లు సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని చెప్పారు.

పీఏసీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే లలితకుమారి



రామాంజనేయులుతో మాట్లాడుతున్న లలితకుమారి

శృంగవరపుకోట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పద్మావతి గెస్ట్‌హౌస్‌లో భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులను ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కలిశారు. ఈ సందర్భంగా ఎస్వీయూనివర్శిటీలో మూడురోజులపాటు జరగనున్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొననున్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

లక్కవరపుకోట,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే ఆరోగ్య లభిస్తుందని వియ్యంపేట ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి తెలిపారు. గొల్జాంలో జాతీయపోషకాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు ఆహారంగా తీసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి ఆధార్ సేవలు

కొత్తవలస, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస సబ్‌పోస్టల్ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం నుంచి 11వతేదీ వరకు ఆధార్ సేవలను అందజేయనున్నట్లు ఎస్.కోట డివిజన్ పోస్టల్‌శాఖ ఇన్‌స్పెక్టర్ వి. సతీష్ తెలిపారు. బుధ, గురువారాల్లో కొత్తవలస-కే.కోటపాడురోడ్డులోగల ప్రగతి కళాశాలలో, 10,11 తేదీల్లో కొత్తవలస-ఎస్.కోట రోడ్డులోగల వాగ్దేవి కాలేజ్‌లోను ఆధార్ సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు, రేపు సర్పంచ్‌లకు శిక్షణ

శృంగవరపుకోట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండల పరిషత్ కార్యాలయంలో బుధ,గురువారాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు ఓవెన్ సోర్స్ రెవెన్యూ అన్న అంశంపై శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సతీష్ ఒకప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు విధిగా అందరూ హాజరుకావాలని కోరారు.

రేపు సీజీఆర్ఎఫ్

చీపురుపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద గురువారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) నిర్వహించనున్నట్లు ఈపీడీసీఎల్ డీఈ పి. త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిదినుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకూ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ సత్యనారాయణ వినియో గదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు

వేపాడ,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ సభల్లో ఉపాధి హామీ పనులు గుర్తింపు, గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై సూచనలు,సలహాలు తీసుకున్నట్లు ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. వేపాడలో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 29 పంచాయతీల్లో సర్పంచ్‌లఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు గ్రామ సభలు నిర్వహించినట్లు చెప్పారు.

అమ్మవార్లకు అలంకరణ



అమ్మవారికి నిమ్మకాయలతో అలంకరించిన దృశ్యం

భోగాపురం,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ పంచాయతీలో గల ముత్యాలమ్మ, తోగలమ్మ అమ్మవార్లను మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో అలంకరించారు. ముత్యాలమ్మ, అమ్మవార్లను నిమ్మకాయలు, తులసి పత్రి మాలలుగా తయారు చేసి అలంకరించారు.

గౌరీపరమేశ్వరుల నవరాత్రులు

కొత్తవలస, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గులివిందాడలో గౌరీపరమేశ్వరుల నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దశాబ్దాలుగా గ్రామంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన గవరకుటుంబ సభ్యులు గౌరీదేవిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి ఏటా తొమ్మిదిరోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. తొమ్మిదో రోజుఅమ్మవారికి మంగళవాయిద్యాలతో రకరకాల పిండి వంటలతో పారె, చీర సమర్పించి నిమజ్జనం నిర్వహిస్తారు.



కొలువుదీరిన గౌరీపరమేశ్వరులు



విజయనగరం రూరల్: పైడిమాంబను దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ నాగార్జున, సీఈవో ఉమామహేశ్వరరావు



విజయనగరం దాసన్నపేట/ కలెక్టరేట్: దర్శనానికి వెళుతున్న బొత్స సత్యనారాయణ

పైడిమాంబకు భక్తి శ్రద్ధలతో పూజలు

● ప్రముఖుల దర్శనం ● స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వితరణ

జిల్లాకు చెందిన ప్రముఖులు పైడిమాంబను మంగళవారం దర్శించుకున్నారు. పైడిమాంబ సిరిమానోత్సవం పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే అధికారులు, ప్రజాప్రతినిధులు దర్శించుకుని పూజలునిర్వహించారు. ఈసందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాగా పలు స్వచ్ఛందసేవా సంస్థల ఆధ్వర్యంలో భక్తులకోసం తాగునీరు, అన్నదానం తదితర వితరణ కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

వేదిక కుంగడాన్ని రాజకీయంగా చూడొద్దు

విజయనగరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):సిరిమానోత్సవం పురస్కరించుకుని శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆశీనులైన వేదిక కొద్దిగా కుంగడాన్ని రాజకీయంగా చూడవద్దని, అనుకోకుండా ఈ సంఘటన జరిగిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సామర్థ్యానికి మించి వేదికపైకి బొత్స అనుచరులు ఎక్కడంవల్ల ఒక్కసారిగా ఒరిగిందనిపేర్కొన్నారు. సిరిమానోత్సవానికి ముందు వర్షం కురవడం, వేదిక ప్రాంతం తడిచిపోవడం వల్ల స్టేజ్ కుంగిందని తెలిపారు. కాగా వర్షం వల్ల వేదిక ఒరిగిందే తప్ప, అంతకు మించి దీని వెనుక ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని డీసీసీబీ అధ్యక్షుడు నాగార్జున తెలిపారు.

ఆలయం వద్ద ఏర్పాట్ల పరిశీలన

విజయనగరంఉత్సవాలు, పైడిమాంబ తొలేళ్లు, సిరిమానోత్సవాలు అందరి సమన్వయంతో విజయవంతంగా జరిగాయని మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, కలెక్టరు రామసుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు, ప్రజలకు, స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులకు, వీటిలో భాగస్వామ్యులు అయ్యే వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి దర్శనం అనంతరం మంత్రులు ఆలయం వద్దవున్న ఏర్పాట్లను పరిశీలించారు.

ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

విజయనగరం దాసన్నపేట/ కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఉండాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆకాంక్షించారు. విజయనగరంలోని మూడులాంతర్ల వద్దగల చదురుగుడి గల పైడిమాంబను బొత్స సత్యనారాయణ, ఆయన సతీమణి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మీ, కుమారుడు సందీప్‌తో పాటు వైసీపీ నాయకులు దర్శించుకున్నారు.పైడిమాంబకు బొత్స కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు.ఈసందర్భంగా ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ వేదిక మార్పుపై స్పందించాలని కోరగా, ఆయన తిరస్కరించారు. పండుగ పూట రాజకీయాలు గురించి మాట్లాడనని తెలిపారు. పండుగ, ఉత్సవాల నిర్వహణకు వ్యాపారులు, ప్రముఖులు ఏ విధంగా దోపిడీకి గురయ్యారో పండుగ తరువాత మాట్లాడతానని చెప్పారు.

దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్

విజయనగరం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిమానోత్సవంలో భాగంగా మంగళవారం మూడులాంతర్లు వద్ద ఉన్న పైడిమాంబ చదురుగుడిలో అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, డీసీసీబీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు, పలువురు పీఏసీఎస్ అధ్యక్షులు దర్శించుకున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో సిరిమానోత్సవంపురస్కరించుకుని రెవెన్యూఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు రెవెన్యూ కళ్యాణ మండపంలో అన్నదానకార్యక్రమం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా కలెక్టరు రామసుందర్‌రెడ్డి రెవెన్యూ ఉద్యోగుల సేవలను అభినందించారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసామూర్తి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాడ్డి గోవింద్ పాల్గొన్నారు.

బొడ్డవరలో గ్రామసభ రసాభాస

● భూములిచ్చినా ఉపయోగంలేదని వాపోయిన జిందాల్ నిర్వాసితులు



గ్రామసభలో నిలదీస్తున్న మహిళలు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బొడ్డవరలో మంగళవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగామారింది.ఈసందర్భంగా జిందాల్ నిర్వాసితులు మాట్లాడుతూ పరిశ్రమలు ఈ ప్రాంతంలో వస్తాయని చెప్పి 18 ఏళ్ల కిందట తమతో భూములు ఇప్పించారని, ఇప్పుడు అందులో ఎటువంటి పరిశ్రమలు రాలేదని, దీంతో కొత్తగా పెట్టే పరిశ్రమల్లోతమకు న్యాయం జరుగుతుందాఅని ప్రశ్నించారు.పరిశ్రమపేరుతో తీసుకున్న తమ భూములు వెనక్కి ఇవ్వాలని 108 రోజులుగా పోరాటం చేస్తుంటే తమను చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిందాల్ రైతులకు న్యాయం చేయాలని కోరిన సమయంలో కొంతమంది వారికి వ్యతిరేకంగా మాట్లాడడంతో మహిళలు తిరగబడ్డారు. తమకు అండగా ఉండి న్యాయంచేయాల్సిన వారు వ్యతిరేకంగా మాట్లాడడంపై జిందాల్ నిర్వాసితులు మండిపడ్డారు. ఈ సందర్భంగా భూములు కోల్పోయిన వారు మాట్లాడుతూ జిందాల్‌కు భూములిచ్చినా ఎటువంటి ఉపయోగం లేకుండాపోయిందని వాపోయారు.అవాంఛనీయ ఘటనలో జరగకుండా సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ మీనా, ఎంపీటీసీ లక్ష్మి పాల్గొన్నారు.

భూములు కొనుగోలు చేయవద్దు

భూములు తమకు ఇవ్వాలని జిందాల్ నిర్వాసితులు అన్ని విధాలుగా పోరాటం చేస్తున్నారని, తొందరపడి పారిశ్రామికవేత్తలు ఆ భూములను కొనుగోలు చేయవద్దని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు.మంగళవారం బొడ్డవర వద్ద జిందాల్ నిర్వాసితులు చేస్తున్న రిలే దీక్షల్లో పాల్గొన్నారు.

ఆశావర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

వేపాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):ఆశావర్కర్లను ఉద్యోగులుగా గుర్తించి,రాజకీయ వేధింపులుఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బొద్దాంలో ఏర్పాటు చేసిన ఆశావర్కర్ల సమావేశంలోఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్లుచెప్పినట్టు చట్టాల్లో మార్పులు తేవడమేకాకుండా,పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల హక్కును హరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.విశాఖలో జరగనున్న సీఐటీయూ జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సీఐటీయూ పూర్వ జిల్లా కార్యదర్శి చల్లా జగన్ ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గాడి అప్పారావు పాల్గొన్నారు.

భూ రీసర్వే కచ్చితంగా నిర్వహించాలి

రేగిడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):భూముల రీసర్వే ప్రక్రియ కచ్చితంగా నిర్వహించాలని తహసీల్దార్ కృష్ణలత పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని తాటిపాడులో నిర్వహిస్తున్న భూసర్వేప్రక్రియను పరిశీలించారు.కార్యక్రమంలో వీఆర్వో నారాయణరావు, శంకరరావు,సర్వేయర్లు లక్ష్మణరావు,వాసుదేవరావు, జయకిరణ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

రేగిడి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి నాణ్యమైన విద్యను బోధించాలని ఎంఈవో వరప్రసాదరావు కోరారు. మంగళవారం మండలంలోని లచ్చన్నవలస ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల వర్క్‌బుక్కుల కరక్షన్‌తో పాటు ఉపాధ్యాయుల హ్యాండ్‌బుక్కుల నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో కార్యాలయ అకౌంటెంట్ సూర్యారావు ఉన్నారు.

వసతిగృహాలపై దృష్టి సారించాలి

కొత్తవలస, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గురుకులాలు, వసతిగృహాల్లో జ్వరాలు, పచ్చకామెర్లు ప్రబలుతుండడంతో దృష్టిసారించాలని, మంచినీటికి సంబంధించి పరీక్షలను నిర్వహించాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ వీవీబీ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం వియ్యంపేట పీహెచ్‌సీలో వైద్యాధికారి అధ్యక్షతన ఆసుపత్రి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో జ్వరాలు, పచ్చకామెర్లు సంభవించే అవకాశాలు ఉండడం వల్ల అప్రమత్తంగా ఉండాలని సూచన చేశారు. కార్యక్రమంల వైద్య సిబ్బంది నరసింహరావు, పద్మావతి, ఈశ్వరరావు, ఆశజ్యోతి, సత్యారావు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

రైతుబజారుకు స్వచ్ఛాంధ్ర అవార్డు

శృంగవరపుకోట అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట రైతు బజారుకు జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డు లభించింది. ఈమేరకు హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రైతుబజారు ఎస్టేట్ అధికారి కె.సంతోష్‌కు అవార్డును అందజేశారు.

లంపీస్కిన్ వ్యాధిపై అవగాహన

లక్కవరపుకోట,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి):మండలంలోని లచ్చంపేట రైతులకు పశువైద్య శాఖ అధికారులకు పశువులకు వచ్చే గాలికుంటు, లంపీస్కిన్ వాధులపై అవగాహనకల్పించారు. మంగళవారం మల్లివీడు పశువైద్యాధికారి ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు.ఈ సంద ర్భంగా కొత్తవలస సబ్ డివిజన్ పశువైద్యసహాయ సంచాలకులు కన్నం నాయుడు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పశువులను తనిఖీచేసి మందులు అందజేశారు.96 పశువులు తనిఖీలకు వచ్చినట్టు సత్య నారాయణ తెలిపారు. కార్యక్రమంలో డీఎల్ డీఏ వైద్యులు జగదీష్, దెందేరు పశు వైద్యులు అరుణకిరణ్, సర్పంచ్ భూమిరెడ్డి, యర్రయమ్మ పాల్గొన్నారు.



సింగాన చెరువు లీకుకావడంతో బురదలో నీరు పట్టుకొంటున్న మహిళలు

చెరువు గట్ల ఆక్రమణ

● నాసిరకం మట్టివేయడంతో లీకులు ● భోగాపురంలో బురదలోనే తాగు నీటిని పట్టుకుంటున్న మహిళలు

భోగాపురం,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో జాతీయరహదారి నుంచి పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలోగల రెండుచెరువు గట్లు లీకవుతుండడంతో రహదారులపై నీరు చేరి బురదమయమవుతున్నాయి. ఇక్కడి చెరువు గట్లు ఆక్రమణకు గురవుతున్నాయి. వీటిపై నాసిరకం మట్టి వేసి కొందరు నిర్మాణాలు చేపడుతున్నారు.ఆక్రమించిన స్థానికులు గట్లు చదునుచేసి సొంత అవసరాలకోసం వినియోగిస్తున్నారు. ప్రధానంగా గట్లపై వర్షానికి కొట్టుకుపోయేలా మట్టి వేయడం, పటిష్ఠంగా ఉండేలా ఏర్పాట్లు చేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరుచేరడంతో లీకవుతున్నాయి.దీంతో చెరువుల్లో నీరురహదారులపైకి చేరుతోంది.ఈనేపథ్యంలో సమీపంలో ఉన్న తాగు నీటికొళాయిల పరిసరాలు బురద నీటితో నిండిపోతున్నాయి.ఆ బురదలోని నీటిలోనే పట్టుకొని తాగాల్సివస్తోందని మహిళలువాపోతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుగట్టుపై ఆక్రమణలను తొలగించి లీకులులేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పైడిమాంబకు ప్రణమిల్లి

(5వ పేజీ తరువాయి)

లేకపోయింది. సిరి మాను ఊరేగింపు ఆసాంతం పైడిమాంబ నినాదాలు నింగిని తాకాయి. ఎప్పటిలాగే కోట బురుజుపై ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు దంపతులు, ఆయన కుమార్తె ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, ఆనందగజపతిరాజు సతీమణి సుదా గజపతిరాజు, కుమార్తె ఊర్మిళ గజపతిరాజు తదితరులు సిరిమానోత్సవాన్ని తిలకించారు. పైడిమాంబకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పిం చారు. రూ.కోటీ 80 లక్షలతో పైడిమాంబ ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నామని ఆయన తెలిపారు. మాన్సాస్ ఛైర్మన్, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ఈనెల 9న శంకుస్థాపన చేస్తారన్నారు. వచ్చే పండుగ లోపు ఈ పనులన్నీ పూర్తి చేసి, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్టు చెప్పారు. మరోవైపు హోంశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత అమ్మవారి ఘటాలను తలపై పెట్టుకుని ఆలయానికి చేరుకున్నారు.

గురుకులాల్లో పర్యవేక్షణ

(5వ పేజీ తరువాయి)



గురుకులంలో అధికారులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నాయక్

విద్యార్థినులను మాత్రమే జాయిన్ చేసుకోవాలన్నారు. ఇకపై ఎక్కువ మందికి జాయిన్ చేయరాదని సూచించారు. ఈ విషయంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో, జిల్లా యంత్రాంగం సకాలంలో స్పందించాలని తెలిపారు. పాఠశాలలో నిలిచిన భవన నిర్మాణంపై ఈఈ మణిరాజును ప్రశ్నించారు. నిధులు లేకపోవడతో పనులు నిలిచిపోయాయని ఆయన తెలిపారు. కాగా భవన నిర్మాణం పూర్తికి ప్రతి ప్రతిపాదనలు పంపించాలని నాయక్ సూచించారు. పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతులు, కిటికీలు, తలుపుల పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గురుకులం పక్కనే ఉన్న ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు జరుపుతున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, డాక్టర్ తనూజతో మాట్లాడి పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆ తర్వాత ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భోజనం చేశారు.

దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలన

(5వ పేజీ తరువాయి)

రోజుకు తనిఖీలు ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగులు తనిఖీలకు వెళ్లిన సమయంలో 104, 108 వాహనాలను ఏర్పాటు చేయాలని సెర్ప్ ఉన్నతాధికారి సూచించారు. కాగా సంబంధిత దివ్యాంగ పింఛన్ దారుల సమాచారాన్ని మ్యాపింగ్ చేయాల్సి ఉంది. పింఛన్‌దారులకు కేటాయించిన సమయం, ఆసుపత్రి సమాచారం ఎంపీడీవో కార్యాలయాలకు అందాల్సి ఉంది.

వైద్యులకు సమాచారం అందించాం

జిల్లాలో 2,781 మంది దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలనకు సంబంధించి వైద్యశాఖ అధికారులకు సమాచారం అందించాం. ఈ నెల 8 నుంచి పునః పరిశీలన జరగాల్సి ఉన్నా అనివార్య కారణాలతో 14 నుంచి నిర్వహిస్తాం. మండలాల వారీగా షెడ్యూల్ ఇవ్వాల్సి ఉంది. వినికిడికి సంబంధించి విజయనగరం ఆసుపత్రికి రిఫర్ చేయనున్నాం. మిగతా వారికి పార్వతీపురం, పాలకొండ ఆసుపత్రుల్లో తనిఖీలు జరగనున్నాయి.

- ఎం.సుధారాణి, పీడీ, డీఆర్‌డీఏ, పార్వతీపురం మన్యం

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

గరుగుబిల్లి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. ఎర్రన్నగుడి జంక్షన్‌లో మండలానికి మోడల్‌గా ప్రభుత్వం మంజూరు చేసిన ఎగ్ కార్ట్ వాహనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.అప్పలనాయుడు, టీడీపీ నాయకులు మర్రాపు పురుషోత్తంనాయుడు, ఎం.నారాయణస్వామి, ఎంపీడీవో పైడితల్లి, సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, బోను చంద్రశేఖరరావు, బోను సురేష్, సీసీలు సీహెచ్ తిరుపతిరావు, బి.రామినాయుడు, వి.లక్ష్మణరావు, టి.చంద్రమోహన్, మరియదాసు పాల్గొన్నారు.

రెండు తలల దూడ జననం

కొమరాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దుగ్గి గ్రామానికి చెందిన రైతు పిచ్చిక రామారావుకు చెందిన గేదె.. రెండు తలల దూడకు మంగళవారం జన్మనిచ్చింది. ఇలా దూడ జన్మించడం చాలా అరుదు అని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. పుట్టిన కొద్ది క్షణాల్లోనే దూడ మరణించింది.



మృతిచెందిన రెండు తలల దూడ

తోటపల్లి అభివృద్ధికి కృషి చేస్తాం



ముఖ్యకార్యదర్శిని సత్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

గరుగుబిల్లి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ హామీ ఇచ్చారని అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ డి.పారినాయుడు, ఈవో సూర్యనారాయణ తెలిపారు. విజయనగరంలో మంగళవారం ఆలయ అభివృద్ధి ట్రస్ట్ ప్రతినిధులు ముఖ్య కార్యదర్శిని కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందుకు రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. దాతలు సహకారంతో ఆలయ పునర్నిర్మాణం పనులు నిర్వహించడంతో సభ్యులను అభినందించారు. ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామన్నారు. అలాగే దాతలు చొరవ చూపాలన్నారు. ముఖ్య కార్యదర్శిని కలిసిన వారిలో సీహెచ్ భాస్కరరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, ఎం.ఫకీరునాయుడు, ఎస్.సత్యనారాయణ, డీవీఎస్ మూర్తి, కె.చలమాజీ, గుంప సోమేశ్వర ఆలయ అర్చకుడు సీహెచ్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



నివాళి అర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : జ్ఞాన సముపార్జనకు పరిమితి లేదని నిరూపించిన మహనీయుడు మహర్షి వాల్మీకి అని ఎస్పీ మాధవరెడ్డి కొనియాడారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకిని నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజుల్లో గణనీయమైన మార్పు

పార్వతీపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజులుగా చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలతో గణనీయమైన మార్పు కనిపిస్తోందని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, డ్రైనేజీల్లో పూడికతీత చురుగ్గా జరుగుతున్నాయన్నారు. తహసీల్దార్లను నోడల్ అధికారులుగా నియమిస్తూ గ్రామాల్లో కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు. రెండు రోజులుగా 15 మండలాల్లోని 1125 తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారన్నారు. 2,388 చోట్ల డ్రైనేజీల్లో పూడిక తీశారన్నారు. 1398 ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లినట్టు కలెక్టర్ వివరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

పార్వతీపురం/కురుపాం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్‌ను గిరిజన సంఘాల నాయకులు హారిక చంద్రశేఖర్, పల్లా సురేష్, దోని సురేష్, రామకృష్ణ, కె.లోవరాజు, టి.బాబ్జీ తదితరులు కోరారు. మంగళవారం ఆయన్ని కలిసి వినతిపత్రం అందజేశారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

మక్కువ రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): దుగ్గేరు, మెండంగి, బాగుజోల, మూలవలస గ్రామాల్లో మంగళవారం వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సులను నిర్వహించారు. మక్కువ ఫారెస్టు సెక్షన్ అధికారి సిహెచ్.గంగరాజు సిబ్బందితో కలిసి వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. వన్యప్రాణుల రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. వన్య ప్రాణులను వేటాడి పట్టుకోవడం, చంపడం, ఇతర ప్రాంతాలకు తరలించడం నేరమన్నారు. వన్యప్రాణి రక్షణ చట్టం 1972 ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమం లో ఎఫ్‌బీవోలు కె.గణపతి, యు.శ్రీనివాసరావు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయండి

సీతానగరం (బలిజిపేట), అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజిపేట, అరసాడ, గళావల్లి పీహెచ్‌సీల పరిధిలోని ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట ఆశావర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలన్నారు. వారికి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గొర్లి వెంకటరమణ, రెడ్డి వేణు, లక్ష్మి, అరుణ, వీరమ్మ, కృష్ణవేణి, మంగ, అప్పలనరసమ్మ, భాగ్యం, శోభ, పార్వతి, చిన్న, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

●వీరఘట్టం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు చెల్లించాలని వీరఘట్టం పీహెచ్‌సీలో నోడల్ అధికారి శాంతికుమారికి మంగళవారం ఆశా వర్కర్లు వినతిపత్రం అందించారు. ఎన్‌హెచ్‌ఎం స్కీం ఏర్పడి 20 సంవత్సరాలు అవుతున్నా కనీస వేతనాలు అమలు కావడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం శిక్షణ పొందిన వారికి పర్మినెంట్ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు.

●మక్కువ రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సమస్యలను వెంటనే పరిష్కరించాలని శంబర, మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూవోలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు, జిల్లా కమిటీ సభ్యుడు జి.కృష్ణారావు, సరస్వతి, లక్ష్మి, సరోజిని పాల్గొన్నారు.

కొనసాగుతున్న మరమ్మతు పనులు

పాలకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సంకిలి పంప్‌హౌస్ వద్ద విద్యుత్ మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సంకిలి పంప్‌హౌస్ వద్ద చెట్లు పడిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దాంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. దాంతో మంగళవారం పనులు చేపట్టారు. నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు పనులను పర్యవేక్షించారు. బుధవారం ఉదయం కుళాయిలు ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని కమిషనర్ తెలిపారు.

ఉపాధ్యాయులు సమాజ సేవకులు



సుశీలను సత్కరిస్తుతన్న ఎమ్మెలే జయకృష్ణ

సీతంపేట రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజ సేవకులని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిబద్ధతను కొనియాడారు. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ ఎం.అన్నాదొర, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, జీసీడీవో రాములమ్మ, ఇన్‌చార్జి ఏటీడబ్ల్యూవో సూర్యనారా యణ, కూటమి నాయకులు హెచ్ ప్రసాద్, పవన్, సర్పంచ్ నీలయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరామర్శ

బెలగాం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలో పచ్చకామెర్లతో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం పరామర్శించారు. వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లా ఆసుపత్రిలో పచ్చకామెర్లతో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించానన్నారు. పాఠ శాలలోని సమస్యలు విద్యార్థినులు తెలిపారన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీలు

సీతానగరం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులు, దుక్కిటెడ్లకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని ఉమ్మడి విజయనగరం జిల్లా పశు సంవర్ధకశాఖ ఏడీలు డాక్టర్ ఎ.ఉషారాణి, డాక్టర్ ఎం.హిమజ కోరారు. మంగళవారం జోగింపేట, సీతానగరం తదితర గ్రామాల్లో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల శిబిరాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15 వరకు శిబిరాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు, పశు సంవర్ధకశాఖ సహాయకులు కె.జానకీరాం, సీహెచ్ శిరీష, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

పాలకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) ప్రిన్సిపాల్ పైల శంకరరావు అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 వల్ల ప్రజలకు పన్ను భారం తగ్గుతోందన్నారు. అధ్యాపకులు గిరిబాబు మాట్లాడుతూ ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంస్కరణలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ పీవో వెలమల అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి కళాశాల నుంచి ఏలాం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గోవిందరావు, నాగభూషణరావు, రామారావు, విజయకుమార్ నాయుడు, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

● సీతానగరం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0పై నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మంగళవారం బూర్జ ఉన్నత పాఠశాల, జోగింపేట కేజీబీవీలో ఎంఈవో జి.సూరిదేముడు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో 109 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో వ్యాసరచన పోటీల్లో కె.కుసుమ, ఆర్.ప్రసన్న, ఇ.మానస... చిత్రలేఖనంలో దాసరి యశోధర, పి.విజయలక్ష్మి, ఎం. యశ్వంత్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

చలో అనకాపల్లిని విజయవంతం చేయండి

పాలకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా మాకవరపురం మండలం భీమబోయినపాలెంలో గురువారం వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. మంగళవారం ఎమ్మెల్సీ నివాసంలో నిర్వహించిన విలేకరులతో సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ



కార్డులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంజూరు చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులను మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పంపిణీ చేశారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కె.జయ ఆధ్వర్యంలో ఆమె స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లా డుతూ ఈ కార్డుతో రాష్ట్రంలో ఎక్కడైన రేషన్ తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, టీడీపీ నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపికను మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. తొలుత ఆమె సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వాలీబాల్ సర్వీస్ చేసి ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎంఈవో చంద్రశేఖర్, తహ సీల్దార్ శేఖరం, పాఠశాల హెచ్‌ఎం భీముడు, స్కూల్ ఛైర్మన్ రాజేశ్, భూషణరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ కమిషన్ ఛైర్మన్ తనిఖీ

పాలకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం రాత్రి ఫుడ్ కమిషన్ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. మెనూపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రిన్సిపాల్‌ను సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశించారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ

సీతంపేట రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): దేవనాపురం సమీపంలోని మలుపు వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక తహసీల్దార్ శ్రీకన్య ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొన్నాయి. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా. నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య ఆధారంగా సదుపాయాలను కల్పించాలన్నారు. మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థికి ప్రమాద బీమా వర్తింపజేయాలన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో గిరిజన సంఘ నాయకులు రొబ్బ లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణారావు, ఆరిక చంద్రశేఖర్, పల్ల సురేష్, బాబ్జీ, దోని సురేష్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పౌర్ణమి



నందన్నను ఊరేగిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గౌరీ పౌర్ణమిని మహిళలు భక్తిశ్రద్ధలతో సోమవారం రాత్రి నిర్వహించారు. నందీశ్వరుడిపై కొలువుదీరిన పార్వతీ పరమేశ్వరుల ప్రతిమలను ఊరేగించారు. రావివలస, రావుపల్లి, కొత్తూరు, గరుగుబిల్లి, గొట్టివలస, శివ్వాం, పెద్దూరుల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నాగుల చవితి వరకూ ఉత్సవాలను కొనసాగించనున్నారు.

●వీరఘట్టం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నడుకూరు, నడిమికెల్ల, కడకెల్ల, వీరఘట్టం గ్రామాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో గౌరీ పౌర్ణమిని నిర్వహించారు. నందన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా పైడిమారమ్మ జాతర

పార్వతీపురం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారాయణపురంలో మంగళవారం పైడి మారమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. విజయనగరం పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవంతో పాటు ఇక్కడ అమ్మవారికి పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు.